క్లుప్తంగా

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ఉషా-ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణమూర్తి

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై అలిమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘమాసం రెండవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం మందార, చామంతి, గులాబీ పుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

అభాగ్యునికి అండగా..



జోజీతో మమత, లయోలా ప్రతినిధి

అల్లిపురం: లారీ ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకుని, నా అన్నవారు లేక దిక్కులేని స్థితిలో గత నాలుగు సంవత్సరాలుగా కేజీహెచ్‌లో కదలలేని స్థితిలో పడివున్న అభాగ్యునికి మమత ఛారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. కేజీహెచ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ అందించిన సమాచారం మేరకు ట్రస్ట్ వ్యవస్థాపకురాలు మమత ఆదివారం కేజీహెచ్‌కు చేరుకుని బాధితుడి నుంచి సమాచారం తెలుసుకున్నారు. తన పేరు జోజి అని.. తనది విజయవాడ అని బాధితుడు తెలిపాడు. ఆరు సంవత్సరాల క్రితం తన తల్లిదండ్రులు చనిపోయారని, ఒక యాక్సిడెంట్‌లో తన కాళ్ల పైనుంచి లారీ వెళ్లిపోవటంతో కాళ్లు దెబ్బతిన్నాయని తెలిపాడు. ఇన్‌ఫెక్షన్ అయి నడవలేని స్థితిలో ఉండడంతో కేజీహెచ్‌లో ఉండిపోయానని తెలిపాడు. తనకు ఎవరూ లేరని చెప్పటంతో అతనిని మమత కేజీహెచ్‌లో ఉన్న సెక్యూరిటీ సహాయంతో అంబులెన్స్‌లో పెందుర్తి లయోలా ఓల్డేజీ హోమ్‌లో చేర్పించారు.

నృత్యకారులకు నర్తన కిరణం బిరుదు ప్రదానం



నర్తన కిరణం బిరుదుతో నాట్యదీపిక అకాడమీ నృత్యకారులు

డాబాగార్డెన్స్ : విశాఖ శాస్త్రీయ నాట్య గురువుల సమైక్య కార్యక్రమం ఆదివారం నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్యదీపిక అకాడమీ పిల్లలు కూచిపూడి నాట్యం ప్రదర్శించి నర్తన కిరణం బిరుదు పొందారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు నాట్యదీపిక అకాడమీ పిల్లలను అభినందించారు. గురువును సత్కరించారు.

గురుశిష్యుల బంధం గొప్పది

సీతంపేట: సృష్టిలో గురుశిష్యుల బంధం ఎంతో పవిత్రమైనదని ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ఆచార్యుడు పి.ఎస్.అవధాని అన్నారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ శ్రీకృష్ణ విద్యా మందిర్‌లో గురువందన్ ఛాత్రాభినందన్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలతో సామాజిక సేవలతోపాటు ప్రగతి కూడా సాధ్యపడుతుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా శ్రీకృష్ణ విద్యామందిర్ ఉపాధ్యాయిని ఎస్.ఎల్.ఎన్.సౌజన్య, జీవీఎంసీ ఉపాధ్యాయుడు జి.వెంకటరమణ, వాగ్దేవి స్కూల్ ఉపాధ్యాయుడు ఎస్.వెంకటరమణలను ఘనంగా సన్మానించారు.

చేతివృత్తిదారులకు 'చేదోడు'

- అర్హులకు రూ.10 వేల ఆర్థిక సాయం
- ఎంతో మేలంటున్న లబ్ధిదారులు





దుస్తులు కుడుతున్న టైలర్

జగదాంబ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు అందించేందుకు సీఎం జగన్ ప్రవేశపెట్టిన చేదోడు పథకం ఈ ఏడాది కూడా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జగనన్న చేదోడు పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి ఖతాలకు నగదు జమచేసేందుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు ఇచ్చిన నివేదికలను జోనల్ కార్యాలయంలో ప్రత్యేకంగా పరిశీలించి బీసీ కార్పొరేషన్‌కు పంపనున్నారు. బీసీ కార్పొరేషన్ నుంచి అర్హుల జాబితా రాగానే లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు నగదు జమ కానుంది.

1101 దరఖాస్తులు

జగనన్న చేదోడు పథకానికి దక్షిణ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 1101 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరి దరఖాస్తులను అధికారులు పరిశీలన పూర్తి చేసి అర్హుల జాబితా విడుదల చేయనున్నారు. కాగా గత ఏడాది 992 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ ఏడాది కొత్తగా 109 మంది దరఖాస్తు చేసుకోవడం విశేషం.

బడుగు బతుకులకు భరోసా

దర్జీలకు గుర్తింపు వచ్చిందంటే అది సీఎం జగన్ చలవే. ఎన్నో ఏళ్లుగా ఎవరూ పట్టించుకోని మమ్మల్ని చేదోడు పథకం ద్వారా ఆదుకుంటున్నారు. ఈ పథకం వలన ఎందరో బడుగు బలహీనవర్గాల టైలర్లు కుటుంబాలకు చేయూత దొరుకుతుంది.

–సీతారామ్, టైలర్, పందుపుల్లలసందు, పూర్ణామార్కెట్

నాయీ బ్రాహ్మణుల జీవితాల్లో వెలుగులు

నాయీ బ్రాహ్మణులు చాలీచాలని సంపాదనతో బతుకులు గడుపుతున్నారు. వెడ్డింగ్ ప్లానర్లు వచ్చాక పెళ్లిళ్ల సమయంలో కూడా ఉపాధి కరవవుతోంది. చేదోడు పథకం కింద ఏడాదికి రూ.10 వేలు వంతున ఆర్థిక సాయం చేస్తామనడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనసుకు నిదర్శనం.

–ఈశ్వరరావు, న్యాయీబ్రాహ్మణుడు, టౌన్‌కొత్తరోడ్డు

అర్హులకు చేదోడు



చేదోడు పథకం నిమిత్తం ఈ ఏడాది మొత్తం 1101 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో అర్హులైన వారందరికీ ఆర్థిక సాయం అందజేస్తాం. ఈనెల 30వ తేదీన లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం సొమ్ము జమ చేస్తుంది.

–కె.శివప్రసాద్, జోనల్ కమిషనర్, జోన్–4, సూర్యాబాగ్, విశాఖ.

హాలీడే హంగామా

- పార్కుల్లో సందడి చేసిన చిన్నారులు
- వాళ్లకి జత కలిసిన పెద్దవాళ్లు



లక్ష్మీటాకీస్ పార్కులో చిన్నారుల సందడి



వ్యాయామం.. ఆట ఒకేసారి

డాబాగార్డెన్స్: అసలే ఆదివారం.. స్కూల్స్ ఉండవు. ట్యూషన్లకు సెలవు. ఇంకేముంది పిల్లలకు జోష్ వచ్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటల్లో నిమగ్నమయ్యారు. నగరంలో ఎక్కడ చూసినా పిల్లల సందడే. ఏ పార్కు చూసినా.. ఖాళీ స్థలాలు.. అపార్టుమెంట్ల సెల్లార్లలో పిల్లల ఆటల సందడి కనిపించింది. నగరంలోని ద్వారకానగర్‌లో గల డైమండ్ పార్కు, డాబాగార్డెన్స్‌లో గల సరస్వతీ పార్కు, పాతనగరంలో గల లక్ష్మీటాకీస్ పార్క్ ఇలా పలు పార్కులు ఆదివారం పిల్లలతో కళకళలాడాయి.

పార్కులోని ఆట పరికరాలతో..

డైమండ్‌పార్కు, సరస్వతీ పార్కు, లక్ష్మీటాకీస్ పార్కుల్లో జీవీఎంసీ ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు అన్ని వర్గాల ప్రజలకు మానసిక ఉల్లాసాన్ని ఇస్తున్నాయి. రెండేళ్ల బాలుడి నుంచి ఏడు పదుల వయస్సు మీరిన వారు కూడా మానసిక ఉల్లాసం కోసం జీవీఎంసీ ఏర్పాటు చేసిన అన్ని వ్యాయామ పరికరాలను వినియోగించుకుంటున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల ఆట పరికరాలుగా కనిపించే ఈ వస్తువులు వారి వ్యాయామానికి కూడా ఉపయోగపడుతున్నాయి. వీటిలో లెగ్ ఎక్సైజ్, బాడీ బిల్డింగ్, హ్యాండ్ ఎక్సైజ్, వాకింగ్, స్టమక్ ఎక్సైజ్ వంటి పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ పరికరాలు పిల్లల ఆటవస్తువులగానే కాకుండా వ్యాయామ పరికరాలుగానూ ఉపయోగపడుతున్నాయి.

క్రికెట్‌తో సందడి..

వ్యాయామ పరికరాలతో పాటు పిల్లలు ఆడుకునేందుకు వీలుగా అన్ని విధాల ఏర్పాట్లు చేశారు. పార్కులో ఏ మూలన కాసింత చోటు కనిపించినా క్రికెట్ ఆడుకుంటూ ఎంజాయ్ చేశారు. మరికొంత మంది వాకింగ్ చేస్తూ కనిపించారు.

పిల్లలతో పెద్దలు కూడా..

పిల్లలతో పాటు పెద్దలు.. వృద్ధులు కూడా ఆటవిడుపుగా గడిపారు. పిల్లలు ఆడుకునే పరికరాల్లో కొన్ని పెద్దలు..వృద్ధులు కూడా వ్యాయామం చేసుకునేందుకు వీలుగా ఉండడంతో పిల్లలను వెంటబెట్టుకుని పార్కుకు వస్తున్నారు. పిల్లలతో పాటు వారు కూడా ఎంజాయ్ చేస్తున్నారు. మరికొంత మంది పిల్లలను నడిపిస్తూ వాకింగ్ చేస్తున్నారు.

సెలవు.. ఆదివారాల్లో..

నగరంలోని పార్కుల్లో ప్రధానంగా డైమండ్ పార్కు, సరస్వతీ పార్కులు సెలవు రోజులు, ఆదివారాల్లో పిల్లలు, పెద్దలతో కళకళలాడుతున్నాయి. ఆయా రోజుల్లో వేకువ జాము 5 నుంచి ఉదయం 10 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం పొద్దుపోయే వరకు కిటకిటలాడుతున్నాయి.

ఎమ్మెల్యే వాసుపల్లి వితరణ



పెద్దాడ ముఖేష్ పిల్లలకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



మంగరాజు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో ఆదివారం మృతి చెందిన నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. జీవీఎంసీ 27వ వార్డు అశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో ఎస్సీ కుల పెద్ద పెద్దాడ అప్పారావు కుమారుడు పెద్దాడ ముఖేష్ గత కొంత కాలంగా అనారోగ్యంతో కింగ్ జార్జి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను ఆదివారం మృతి చెందాడన్న విషయాన్ని పార్టీ నాయకుల ద్వారా తెలుసుకుని ముఖేష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, దహన సంస్కారాల కోసం తన సొంత నిధుల నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే పిల్లల చదువులు కూడా ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈతలపాలక విజయ్, మధు తదితరులు పాల్గొన్నారు.

31వ వార్డులో..

జీవీఎంసీ 31వ వార్డు కనకలదిబ్బలో పార్టీ నాయకురాలు బంటుపల్లి ధనలక్ష్మి సోదరుడు దాసరి మంగరాజు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగరాజు ఇంటికి వెళ్లి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్ జైన్, దొడ్డి బాపూ ఆనంద్, ధనలక్ష్మి, చంటి, రాంబాబు, ఆర్పీలు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ

మహారాణిపేట : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వ సభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. జీతాలు ఒకటో తేదీన వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి బీవీఎస్ఎన్ రవిశంకర్ మాట్లాడుతూ డీఏ బకాయిలు విడుదల చేయాలన్నారు. అలాగే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పీఎం జవహర్‌లాల్, ఉపాధ్యక్షుడు ఐ.రాఘుబాబు, సీహెచ్ శ్రీనివాసకుమార్, జిల్లా, సిటీ అధ్యక్షులు, కె.కృష్ణాజీ, జిల్లా కోశాధికారి వి.ధనరాజు, 13 తాలుకాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఓల్డ్ ఏజ్ హోంలో అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న పీతల వాసు

అల్లిపురం: నగరంలోని బీచ్ వీధి చిల్లర వర్తకుల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు సీహెచ్ బంగారాజు 12వ వర్ధంతి సందర్భంగా ఆదివారం అమెరికన్ హాస్పిటల్ ఓల్డేజీ హోంలో వృద్ధులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పీతలవాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారాజు సోదరుడు తన సోదరుని సంస్మరణార్థం గత 12 సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. బంగారాజు తనకు మంచి మిత్రుడని కొనియాడారు.

వేటూరి పాటలు అజరామరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత విజయ్‌కుమార్

సీతంపేట: తెలుగు భాష ఉన్నంత వరకు వేటూరి పాటలు ప్రజల హృదయాల్లో నిలిచి పోతాయని విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్ కుమార్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రఖ్యాత సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి 88వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సినీ సంగీత దర్శకుడు పాలగుమ్మి రాజగోపాల్ మాట్లాడుతూ 'సినీ కళామతల్లి నుదుట సింధూరం, అలనాటి వాగ్గేయకారులు త్యాగయ్య, అన్నమయ్య, భక్తరామదాసుల ఏక అవతారమే వేటూరి' అని కీర్తించారు. ఈ సందర్భంగా ఝుమ్మంది నాదం పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. రాజేంద్రప్రసాద్, జ్యోత్స్న పాడిన రాగాల మేళవింపా.. రమేష్ పట్నాయక్, శృతి పాడిన వే వేళా గోపెమ్మలా.. ఎంవీఆర్ నాగేశ్వరరావు, సూర్యకుమారి పాడిన మనసులోని కోరిక.. జోగారావు, రచన శ్రీకృతి పాడిన స్వప్న వేణువేదో.. ఫణిభూషణ్, కల్యాణి పాడిన ఒకపూల బాణం.. ధీరజ్ పాడిన కంచికి పోతావా కృష్ణమ్మ.. ఫణిభూషణ్, దీప్తి పాడిన పూసింది పూసింది పున్నాగా.. శశిరాణి పాడిన ఓహో మేఘమాల వంటి ప్రజాదరణ పొందిన గీతాలతో అలరించారు. ఆత్రేయ పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, కళారంగ ప్రముఖులు కొణతాల రాజు, మహమ్మద్ ఖాన్, ఫణిస్వామి, చెన్నా తిరుమలరావు, ఎస్.ఎస్.ఎన్.రాజు, సన్ మూర్తి, టి.రాధారాణి తదితరులు వేటూరి సేవలను కొనియాడారు. ముందుగా వేటూరి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.

ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం



ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎన్నికల అధికారి

మహారాణిపేట : పంచాయితీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.సత్తిబాబు, ప్రధాన కార్యదర్శిగా డి.సీతారామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒక్కొక్క పోస్టుకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్టు ఎన్నికల అధికారి పి.అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ తనను మూడోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని అన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, సీఈవో శ్రీరామ్మూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎన్నికైన అధ్యక్షుడిని రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్ అభినందించారు. ఎన్నికల పరిశీలకుడిగా విజయనగరం జిల్లా అధ్యక్షుడు మురళీ, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, విజయనగరం జిల్లా ఎన్‌జీవో అధ్యక్షుడు సురేష్, సహాయ ఎన్నికల అధికారిగా యు. కూర్మారావు వ్యవహరించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా బీహెచ్‌వీ రమణబాబు, ఉపాధ్యక్షుడిగా ఆర్‌వీ నాగరాజు, యుఎస్‌వీ శ్రీనివాసరావు, ఎల్.పూర్ణయ్య, సంయుక్త కార్యదర్శులుగా కె.సత్యనారాయణ మూర్తి, కె.ఆనందకుమార్, వై.రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా డీవీఎస్ గౌరీపతిరావు, వి.రాధ, డి.కొండలరావు, జేసీసీ మెంబర్‌గా సీహెచ్ ఫ్లోరెన్స్ నైటింగేల్, స్టేట్ కౌన్సిలర్లుగా జి.గంగాధర్, ఎ.సత్యనారాయణ, సీహెచ్ సింహాచలం, జీఎల్ నరసింహం, కోశాధికారిగా ఎస్.త్రినాథ్ తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను, సీఈవోను మర్యాదపూర్వకంగా కలిసింది.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



మహిళ కంట్లో చుక్కల మందు వేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్: శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. నిపుణులైన డాక్టర్లచే అన్ని రకాల కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి లెన్స్ ఆపరేషన్లు కూడా చేయిస్తున్నారు. మందులు ఉచితంగా అందజేశారు. వైద్య శిబిరానికి వచ్చిన పేషెంట్లకు వివేకానంద సంస్థ టీ, స్నాక్స్, మాస్క్‌లు అందజేసింది. నేత్ర వైద్య శిబిరాన్ని డాక్టర్ జహీర్ అహ్మద్, రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వివేకానంద సంస్థ కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వస్తుందన్నారు. చాలా మందికి ఆపరేషన్లు చేయించి, సంస్థ వారే స్వయంగా ఇంటికి చేరుస్తుందని చెప్పారు. ఇలాంటి ఆపరేషన్లు కార్పొరేట్ ఆసుపత్రిలో ఖరీదుతో కూడుకున్నవన్నారు పేద ప్రజల కోసం ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, అనేక సేవలందిస్తున్న వివేకానంద సంస్థను కొనియాడారు. సుమారు 300 మంది వైద్య శిబిరంలో పాల్గొన్నారు. 40 మందికి ఆపరేషన్ అవసరం కాగా, వీరందర్నీ శంకర్ ఫౌండేషన్ సిబ్బంది బస్సులో తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించి సురక్షితంగా సంస్థ వద్దకు తీసుకురానున్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, శంకర్ ఫౌండేషన్ సిబ్బంది సత్యవతి, దేవి, రేవతి, లోకేష్, క్యాంపు కో ఆర్డినేటర్ పైడిరాజు, సతీష్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ వద్ద..



వైద్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: ఫిషింగ్ హార్బర్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ కార్యాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. తీరప్రాంత వాడబలిజ (మత్స్యకార) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సంఘం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో కేజీహెచ్ ప్రొఫెసర్ వాసుపల్లి రవి, ఈఎస్ఐ హాస్పిటల్ సివిల్ సర్జన్ ఎం.ఉమారాణి, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అంబటి మోహన్, డాక్టర్ కోడ సంజయ్, డాక్టర్ బెహరా గిరీష్, డాక్టర్ బైపల్లి ప్రశాంతి, డాక్టర్ కొమర అనూష తదితర వైద్యులను ఆయన సత్కరించారు. శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అర్జాల రమణ, ప్రధాన కార్యదర్శి తోలాన వెంకట శివప్రసాద్, ఫిషరీస్ జేడీ విజయ, సంఘం వ్యవస్థాపకులు వాసుపల్లి కృష్ణారావు, బర్రి కొండబాబు, సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నమో భువనేశ్వరీ..



భువనేశ్వరీదేవికి మంగళస్నానాలు చేయిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

- వైభవంగా అధివాసం
- పోటెత్తిన భక్తజనం

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు మణిపురంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఇక్కడ కొలువైన భువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆదివారం నిర్వహించిన ఈ ప్రత్యేక అభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. భువనేశ్వరీదేవి ఆరాధన పీఠం ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. మండలం రోజులకు (41 రోజులకు) ఒకసారి వచ్చే ఆదివారం ఈ అధివాసం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ అధివాసం వాకుడు(బృహతి) పత్రితో నిర్వహించారు. ముందుగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి మంగళస్నానాలు చేయించారు. దివ్య పంచామృతాలతో అభిషేకించి, అనంతరం దివ్యాలంకరణ చేసి అర్చనాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు క్యూలో నిరీక్షించి మరీ అమ్మవారికి స్వయంగా పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి నిర్వహించారు.